సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కుటుంబ సభ్యులకు అప్పగింత



పుల్షీరామ్‌ను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు

సీతమ్మధార: మధ్యప్రదేశ్‌కు చెందిన పుల్షీరామ్..మానసిక స్థితి బాగోలేకపోవడంతో రెండేళ్ల క్రితం విశాఖ వచ్చేశాడు. పలు ప్రాంతాల్లో సంచరిస్తుండగా ఏయూటీడీ ..జీవీఎంసీ టీఎస్ఆర్ షెల్టర్‌లో చేర్పించింది. శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు అతడికి సపర్యలు చేసి చికిత్స అందజేశారు. నాటి నేటి వరకు క్రమం తప్పకుండా మందులు వాడించడంతో కోలుకున్నాడు. దీంతో పుల్షీరామ్‌ను సొంత గ్రామానికి తీసుకువెళ్లారు. భార్య, కుమారుడు ఇంటి వద్ద లేకపోవడంతో మనవడు, మనమరాలికి అప్పగించారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ ప్రతినిధులు

సీతమ్మధార: రాష్ట్రంలోని రెండు ఐఎఫ్‌టీయూ విప్లవ కార్మిక సంఘాల విలీన సభ మార్చి 2న నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వేంకటేశ్వర్లు ప్రకటించారు. జీవీఎంసీ గాంధీ పార్కులో దీనికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. నాలుగు లేబర్ కోడ్‌లను బలవంతంగా కార్మిక వర్గంపై రుద్ది వారి హక్కులను కాలరాయడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని మండిపడ్డారు. ఒకవైపున నిత్యావసర సరుకుల ధరలు పెద్ద ఎత్తున పెరుగుతూ ఉంటే మరొక వైపు కార్మికుల వేతనాల తగ్గింపు, పనిభారం పెంపు తగదన్నారు. ఈ నేపథ్యంలో బలమైన కార్మిక పోరాటానికి ఈ విలీనం దోహదపడుతుందన్నారు. సంఘం సీనియర్ నాయకులు వై.కొండయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీను, దుర్గ, గురప్ప పాల్గొన్నారు.

రాజు మృతి తీరని లోటు



అల్లిపురం: అఖిల భారత ఫిష్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి, కేరళ రాష్ట్ర పూర్వ శాసనసభ్యుడు, ఏర్నాకులం జిల్లా సీపీఐ కార్యదర్శి, కేరళ రాష్ట్ర ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు పి.రాజు (73) గురువారం అనారోగ్యంతో కేరళ రాష్ట్రం కోచిలో మృతి చెందారు. ఆయన మృతికి ఆల్ ఇండియా ఫిష్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. అతనితో పాటు ఏపీ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెయ్యల నాగభూషణరావు, పోర్టు అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి బీసీహెచ్ మసేన్ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. రాజుతో పనిచేసిన జ్ఞాపకాలను వారు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

సనాతన ధర్మం అన్నిటికన్నా గొప్పది

గాజువాక: సనాతన ధర్మం అన్నిటికన్నా గొప్పదని, అందరూ పాటించాల్సిన బాధ్యత ఉందని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు అన్నారు. స్థానిక శ్రీనగర్‌లో గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో దివ్యప్రాణ ప్రతిష్ఠ, 108 కుండీల గాయత్రి మహాయజ్ఞం గురువారం నేత్రపర్వంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన పెరగాలన్నారు. గీతా పారాయణ, గాయత్రి మంత్రం, భగవద్గీత పఠనం మనిషిని మార్చుతాయన్నారు.

నగర అభివృద్ధిలో ఎన్జీవోల పాత్ర కీలకం

సీతంపేట : స్వచ్ఛంద సంస్థలు కోవిడ్ కాలంలో, ప్లాస్టిక్ వాడకం నిర్మూలన, మొక్కలు నాటడం, బాల కార్మిక వ్యవస్థ నియంత్రణ, నిరక్షరాస్యత నిర్మూలన... ఇలా ఎన్నో విషయాల్లో జీవీఎంసీతో కలిసి పని చేయడం అభినందనీయమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. వైజాగ్ ఎన్జీవో ఫోరం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. త్వరలో ఎన్జీ వో సంస్థల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి నగర అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సత్కరించారు.

రైతుబజారు కలేనా..!

- 'దక్షిణం'లో ఒక్క రైతుబజారూ ఏర్పాటు చేయని వైనం
- బయటి మార్కెట్‌లో అధిక ధరలతో స్థానికుల బెంబేలు



డాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధిలో రైతు బజారు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో స్థానిక మార్కెట్లలో అధిక ధరలకే కూరగాయలు, ఆకుకూరలు వంటివి కొనుగోలు చేయాల్సి వస్తోంది. లేదంటే దూరప్రాంతంలో ఉన్న రైతుబజార్లను ఆశ్రయించాల్సి వస్తోంది.

విశాఖ దక్షిణ నియోజకవర్గమంటే విశాఖపట్నానికి ఆయువుపట్టు. ప్రభుత్వ కార్యాలయాలు చాలా వరకు ఇక్కడే ఉండడంతో కార్యకలాపాలన్నీ ఇక్కడి నుంచే నడుస్తాయి. కానీ ఇక్కడి ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా అందడం లేదు. నియోజకవర్గంలో ఉండేది ఎక్కువగా బడుగు, బలహీన వర్గాల వారే. ఉదయం వెళ్తే, తిరిగి రాత్రి పొద్దుపోయిన తర్వాత వచ్చే దినసరి కూలీలు, కలాసీలు, ఆటో కార్మికులు.. ఇలా అల్పాదాయ వర్గానికి చెందినవారే ఈ ప్రాంతంలో నివాసముంటున్నారు. వీరు రోజంతా కష్టపడితే నాలుగైదు వందలు వస్తాయి. ఓవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతుండడంతో పాటు కూరగాయలూ బయట మార్కెట్‌లో కొనుగోలు చేయడం వీరికి భారంగా మారుతోంది. రైతులే నేరుగా తీసుకురావడంతో తక్కువ ధరలకే కూరగాయలు లభ్యమయ్యే రైతుబజారు ఏర్పాటు చేయాలని ఎందరో అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. కానీ వారి కల ఇప్పటికీ నెరవేరలేదు.

నగరంలో ఇలా..

విశాఖ మహానగరంలో పలు రైతు బజార్లు ఉన్నాయి. తూర్పు నియోజకవర్గంలో త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పక్కన, ఎంవీపీ కాలనీలో రైతు బజార్లు ఉండగా, ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి సీతమ్మధార, నరసింహనగర్, కంచరపాలెం, మర్రిపాలెంలో రైతు బజార్లు ఉన్నాయి. అలాగే పశ్చిమ నియోజకవర్గం, గాజువాక, పెందుర్తిలోనూ రైతు బజార్లు ఉన్నాయి. ఒక్క దక్షిణ నియోజకవర్గంలో మాత్రం ఒక్క రైతు బజారు కూడా లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులు గుర్తించి, రైతు బజార్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కంచరపాలెం వెళ్లాల్సి వస్తోంది



మా ప్రాంతంలో ఎక్కడా రైతు బజారు లేకపోవడంతో ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న కంచరపాలెం రైతు బజారుకు వెళ్లాల్సి వస్తోంది. కూరగాయల్లో మిగిలింది ప్రయాణ చార్జీలకే సరిపోతుంది. అధికారులు మా బాధలు గుర్తించి రైతుబజారు ఏర్పాటు చేయాలి.

– వర్రి వరలక్ష్మి, మహారాణిపేట

మాపై ఎందుకింత చిన్నచూపు



అధికారులు మా ప్రాంత ప్రజలను పట్టించుకోవడం లేదు. ఇక్కడ అందరూ పేదలే నివసిస్తున్నారు. వారి కష్టాలను, ఆర్థిక ఇబ్బందులను అధికారులు, ప్రజా ప్రతినిధులు గుర్తించాలి. రైతుబజారును అందుబాటులోకి తేవాలి.

– పసగాడ రామలింగేశ్వరరావు, స్థానికుడు

ప్రజా వ్యతిరేకత తట్టుకోలేకనే అక్రమ అరెస్టులు

- పవన్ కల్యాణ్ ఒత్తిడితోనే పోసాని అక్రమ అరెస్టు
- కేసులు పెడితే ఎదిరించి నిలబడతాం
- కూటమి ప్రభుత్వంపై మండిపడ్డ వాసుపల్లి గణేష్‌కుమార్



డాబాగార్డెన్స్: ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక రెడ్ బుక్ రాజ్యాంగం నడుపుతూ వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. పోసాని అరెస్టును ఖండిస్తూ వాసుపల్లి మీడియాతో గురువారం మాట్లాడారు. పవన్, లోకేష్ ఇద్దరి వద్ద రెడ్‌బుక్స్ ఉన్నాయని, భారత రాజ్యాంగం అనుసరిస్తూ నిర్వర్తించాల్సిన బాధ్యతలు తుంగలో తొక్కుతూ కేవలం కక్షపూరిత రాజకీయాలకే పరిమితమయ్యారని మండిపడ్డారు. పోసాని అరెస్టు పవన్ కల్యాణ్ ఆలోచన అని విరుచుకుపడ్డారు. ఎంతో పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్ నేడు చంద్రబాబు కబంధ హస్తాల్లో ప్రపంచ వ్యాప్తంగా ఇమేజ్ డామేజ్ అవుతుందని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వాళ్లే తగిన గుణపాఠం చెప్తారని వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. రాజ్యాంగానికి విరుద్ధంగా నడిస్తే ఎంతటి వారినైనా జగన్‌మోహన్‌రెడ్డి 2.0లో విడిచిపెట్టేదే లేదన్నారు. భవిష్యత్‌లో ఇంతకంటే తీవ్ర పరిణామాలుంటాయని గుర్తు పెట్టుకోవాలన్నారు. ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టిన ఎదిరించి నిలబడతామని, తమ వెనుక జననేత జగన్‌మోహన్‌రెడ్డి అనే మహాశక్తి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అసలు పరిపాలన జరుగుతుందా? అని ప్రశ్నించారు. సామాన్య ప్రజలకు సంక్షేమ ఫలాలు అందట్లేదని, అభివృద్ధికి నోచుకోని ఆంధ్రప్రదేశ్‌లో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే మాటే లేదన్నారు. కేవలం రెడ్ బుక్ పేరిట కక్షపూరిత రాజకీయాలు చేస్తూ ప్రజల పక్షాన ప్రశ్నించే వైఎస్సార్ సీపీ గొంతును నులిపేయడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేవారు. ప్రజాస్వామ్యంలో ఇది సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంటే కేంద్ర మంత్రి అమిత్‌షా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర పరిణామాలపై కేంద్రం జోక్యం చేసుకుని కట్టడి చేయకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని వాసుపల్లి హెచ్చరించారు.

ఘనంగా చినదుర్గాలమ్మ వార్షిక జాతర



అలంకరణలో చిన దుర్గాలమ్మ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అల్లిపురం: అచ్చియ్యమ్మపేట వాసుల ఆరాధ్య దైవం చిన దుర్గాలమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. సాయంత్రం మిరపకాయలవీధిలో గల అమ్మవారి పెద్దింటి నుంచి మేళతాళాలు, తప్పెటగుళ్ల తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి తిరువీధి ఉత్సవం వైభవంగా చేపట్టారు. అమ్మవారి తిరువీధి ఉత్సవం మిరపకాయలవీధి, నారాయణవీధి, సాయిబాబావీధి, గోవిందరోడ్డు, బృందావన్ జంక్షన్, కెప్టెన్ రామారావు జంక్షన్ మీదుగా అచ్చియ్యమ్మపేటలో గల అమ్మవారి ప్రధాన దేవాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా అమ్మవారి పూల ఘటాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

అన్నసమారాధన నిలిపేయడం దారుణం

డాబాగార్డెన్స్: కల్యాణపులోవ తిరుణాళ్లలో వేలాది మంది భక్తులకు ఏటా నిర్వహించే మహా అన్న సమారాధనను ఎన్నికల కోడ్ పేరిట కూటమి ప్రభుత్వం నిలిపేయడం దారుణమని వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు రామన్నపాత్రుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అన్నసమారాధన నిర్వహించకపోవడం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ముందుగా తెలిపితే సొంతంగా తనే అన్నదానం చేసేవాడినన్నారు. పదేళ్ల క్రితం సొంత నిధులతో కల్యాణపులోవ తిరునాళ్లకు విచ్చేసిన వేలాది మంది భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని తానే ప్రారంభించానని గుర్తు చేశారు.

హైదరాబాద్ హలీం సెంటర్ ప్రారంభం



హలీం సెంటర్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం నాయకుడు ఫారూఖీ

డాబాగార్డెన్స్: రంజాన్ మాసం పురస్కరించుకొని నగరంలోని జగదాంబ జంక్షన్ మక్కా మసీదు సమీపాన దండుబజార్ రోడ్డులో హైదరాబాద్ హలీం సెంటర్‌ను నిర్వాహకులు షేక్ జుబేర్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ స్టేట్ మైనార్టీ జనరల్ సెక్రటరీ ఐఎం ఫారుఖీ మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రమైనదని, ఉపవాస దీక్ష అనంతరం ముస్లింలు స్వీకరించే హలీంను ప్రతి ఏటా నిర్వహించడం మంచి సంప్రదాయమన్నారు. హలీం సెంటర్ నిర్వాహకుడు షేక్ జుబేర్, సీరత్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ లతీఫ్, కైలాసపురం మసీదు అధ్యక్షుడు మునీర్‌ఖాన్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు చిన్నారి



తణుశ్రీకి భోజనం తినిపిస్తున్న కానిస్టేబుల్



పాపను తల్లికి అప్పగించిన పోలీసులు

అల్లిపురం: మహాశివరాత్రి పుణ్యస్నానాలు సందర్భంగా బుధవారం ఆర్కే బీచ్ కిటకిటలాడింది. వేలాది మంది భక్తులు రావడంతో బీచ్ ప్రాంతం జనసందోహమైంది. ఈ సమయంలో చిన్నారులు తప్పిపోవడంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో కంచరపాలేనికి చెందిన తణుశ్రీ తల్లిదండ్రుల నుంచి తప్పిపోయింది. బాలికను గుర్తించిన మహారాణిపేట పోలీసులు చేరదీసి పోలీస్ అవుట్‌పోస్టులో కూర్చోబెట్టారు. పాపకు భోజనం పెట్టి ఆకలి తీర్చారు. ఇంతో పాలు మైక్‌లో ఎనౌన్స్‌మెంట్ ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు అక్కడకి చేరుకోవడంతో పాపను అప్పగించారు. ఈ సందర్భంగా వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్



ఓటు వేసి బయటకు వస్తున్న ఉపాధ్యాయులు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం దక్షిణ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. నియోజకవర్గ పరిధి ప్రేమసమాజం పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ సాగింది. మొత్తం 265 ఓట్లకు గానూ 244 ఓట్లు పోలయ్యాయి.



పేదలకు చీరల పంపిణీ



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఆలయ నిర్వాహకులు, వైఎస్సార్ సీపీ నాయకులు

డాబాగార్డెన్స్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని నియోజకవర్గ పరిధి ఏవీఎన్ కళాశాల సమీపాన కేజీహెచ్ అనాటమీ విభాగ ప్రాంతంలో వేంచేసియున్న శివాలయంలో గురువారం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, వైఎస్సార్ సీపీ నాయకులు దళమంతుల మాణిక్యాలరావు, దళమంతుల చిన్ని సంయుక్త ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అటవీ అభివృద్ధి శాఖ మాజీ డైరెక్టర్ పీతల వాసు, దక్షిణ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు రవితేజ, సోషల్ మీడియా ప్రెసిడెంట్ బెవర మహేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకుల శ్యామ్‌కుమార్, పార్టీ నాయకులు ఆరుగుల రాజ్‌కుమార్, రాము, రామలక్ష్మి, సీత తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

- వేడుకగా అమ్మవారి జాతర
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలి వచ్చిన భక్తులు



డాబాగార్డెన్స్: నగరంలోని పూర్ణామార్కెట్ దరి వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవం పురస్కరించుకొని గురువారం ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత అమ్మవారికి వైభవంగా నేత్రోత్సవం, తొలిపూజ నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భవానీ మాలలు వేసిన మాతలు కళశాలతో పసుపు కుంకుమ నీళ్లతో ఊరేగింపుగా ఆలయానికి విచ్చేసి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ పరిసర పలు ప్రాంతాల్లో అగ్నిగుండాలు తొక్కే కార్యక్రమం జరిపారు. సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గత వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతర మహోత్సవాలు గురువారంతో ముగిశాయి.

మార్చి 6న మారువారం పండగ

అమ్మవారి మారువారం పురస్కరించుకొని మార్చి 6న అష్టోత్తర శత పదార్థం (108 రకాల వంటకాలతో అమ్మవారికి నివేదించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేయనున్నారు) నివేదించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం వద్ద ఐదువేల మంది భక్తులకు మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకాలు



నేరెళ్లకోనేరు అరుణలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు



శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో విశేష అలంకరణలో శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి

అల్లిపురం: మహా శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి 11 గంటల తరువాత టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకాలు చేపట్టారు. ఈ సందర్భంగా నమక చమక విన్యాసాలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఉమా చంద్రమౌళీశ్వరస్వామికి ఢమరుక నాథాలతో భస్మాభిషేకం చేపట్టారు. అనంతరం మూలవిరాట్టును విశేషంగా అలంకరించి హారతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా శివనామస్మరణతో నిండిపోయింది.

నేరెళ్లకోనేరులో..

నేరెళ్లకోనేరులోని అరుణలింగేశ్వర ఆలయంలో లింగోద్భవ కాలంలో జరిగిన మహా రుద్రాభిషేకంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు.

ఆటో డ్రైవర్ మృతి

అల్లిపురం: వేంకటేశ్వరమెట్ట, గొల్లవీధిలో అద్దెకు ఉంటున్న యలమల శ్రీనివాసరావు (55) రెండు రోజులుగా ఇంట్లో నుంచి బయటకు రావటం లేదు. దీంతో ఇంటి యజమాని గురువారం ఉదయం ఇంటి తలుపులు తీసి చూడగా గదిలో కింద పడిపోయి ఉన్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడు ఏలూరికు చెందిన వ్యక్తిగా గుర్తించారు. గదిలో అతను ఒక్కడే ఉంటున్నట్లు తెలిపారు. ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. విషయం అతని కుటుంబ సభ్యులకు తెలియజేయటంతో భార్య వై.వెంకటలక్ష్మి టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఐదేళ్లుగా భార్యాభర్తలు ఇద్దరు విడిపోయి ఉంటున్నారని పోలీసులు తెలిపారు. ఆమె జైలురోడ్డులోని ఫుట్‌కోర్టు వద్ద వాటర్ బాటిల్స్ అమ్ముకుంటూ జీవిస్తున్నట్లు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బి.తిరుమలరావు తెలిపారు.



